# పట్టు పరిశ్రమకు పూర్వ వైభవం.. రైతుకు బంగారు భవిష్యత్

**శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడి.. ఆధునిక పద్ధతులతో రైతుకు మెరుగైన ఆదాయం -'మేరా రేశమ్‌మేరా అభిమాన్ 2.0'లో పట్టురైతులకు అవగాహన**





**కలెక్టరేట్ /హనుమకొండ బ్యూరో ఆగస్టు 21 (జర్నలిస్ వార్త):** పట్టు పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావడంతోపాటు పట్టురైతుల ఆదాయాన్ని పెంచేందుకు శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని అధికారులు, శాస్త్రవేత్తలు సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడంతోపాటు నాణ్యమైన మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు.కేంద్ర పట్టు బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేరా రేశమ్‌మేరా అభిమాన్ 2.0' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో హనుమకొండ, వరంగల్ జిల్లాల సెరికల్చర్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన పట్టు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హనుమకొండ పట్టు పరిశ్రమ జాయింట్ డైరెక్టర్ అనసూయ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ఆమెతోపాటు కేంద్ర పట్టు బోర్డు శాస్త్రవేత్తలు ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు.

**మల్బరీ సాగుపై ప్రత్యేక అవగాహన**

అధిక దిగుబడినిచ్చే మల్బరీ రకాలను ఎంపిక చేసుకోవడం, నాణ్యమైన మొక్కలను సరైన పద్ధతిలో నాటడం, మొక్కలకు అవసరమైన పోషకాలను అందించడం వంటి అంశాలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. మల్బరీ ఆకుల నాణ్యత పట్టు పురుగుల పెరుగుదలపై ప్రభావం చూపుతుందని, అందువల్ల ఆకుల నాణ్యత విషయంలో రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

**పట్టు పురుగుల పెంపకంలో అప్రమత్తత**

పట్టు పురుగుల పెంపకంలో పరిశుభ్రత అత్యంత కీలకమని శాస్త్రవేత్తలు తెలిపారు. గదిలో ఉష్ణోగ్రత, తేమను అనుకూలంగా ఉంచడంతోపాటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పట్టు పురుగుల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే మొత్తం పంట దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**నీటిని పొదుపుగా వినియోగించాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. మల్బరీ తోటల్లో నీటి వినియోగాన్ని తగ్గించేందుకు ఆధునిక నీటిపారుదల పద్ధతులను అవలంబించాలని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటితోనే మెరుగైన దిగుబడి సాధించేలా పంట యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు.

**యాంత్రీకరణతో సాగు ఖర్చుకు చెక్**

కూలీల కొరత, పెరుగుతున్న కూలి ఖర్చుల నేపథ్యంలో పట్టు పరిశ్రమలో అందుబాటులో ఉన్న యాంత్రీకరణ పద్ధతులను రైతులు వినియోగించుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఆధునిక పరికరాల వినియోగంతో శ్రమ, సమయం, ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు.

**ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, వివిధ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అర్హత ఉన్న ప్రతి రైతు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పట్టు పరిశ్రమను లాభదాయకంగా మార్చుకోవాలని అధికారులు సూచించారు. పట్టు పరిశ్రమలో యువతకు ఉన్న ఉపాధి, స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలను కూడా వివరించారు.

**సవాళ్లను అధిగమిస్తే మంచి భవిష్యత్**

పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం, వాతావరణ మార్పులు,



చీడపీడలు, వ్యాధుల కారణంగా పట్టు రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు తెలిపారు. అయితే శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతికత, యాంత్రీకరణ, నీటి పొదుపు విధానాలను పాటిస్తే ఈ సమస్యలను అధిగమించవచ్చన్నారు. రైతులు ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు, పట్టు పరిశ్రమ అధికారుల సూచనలు తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో హనుమకొండ జాయింట్ డైరెక్టర్ అనసూయ, సీఎస్‌బీసీఎస్‌ఆర్‌టీఐ మైసూరు శాస్త్రవేత్త డా. వజ్రమ్మ, సీఎస్‌బీఆర్‌ఎస్‌ఆర్‌ఎస్ ములుగు శాస్త్రవేత్త డా. భువన, వరంగల్ పట్టు పరిశ్రమ అధికారి తిరుపతిరెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొని రైతులకు పట్టు సాగు, పురుగుల పెంపకం, వ్యాధుల నివారణ, ఉత్పత్తి పెంపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పట్టు రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించి, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటే పట్టు ఉత్పత్తి, నాణ్యతతోపాటు ఆదాయం కూడా పెంచుకోవచ్చని అధికారులు తెలిపారు. హనుమకొండవరంగల్ జిల్లాల్లో పట్టు పరిశ్రమకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా రైతులకు నిరంతరం సాంకేతిక సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# ఆధారాలతో నిరూపించాలి

**పిడమర్తి రవికి మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ సవాల్**

**సత్తుపల్లి/ఆగస్టు 21 (జర్నలిస్ వార్త):**



డంపింగ్ యార్డు ఏర్పాటులో అవినీతి జరిగిందంటూ పిడమర్తి రవి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు ఆరోపణలు చేయడం సులభమేనని వాటిని ఆధారాలతో నిరూపించాల్సిన బాధ్యత ఆరోపణలు చేసిన వారిపైనే ఉందన్నారు డంపింగ్ యార్డు ఏర్పాటులో అవినీతి జరిగిందని చెబుతున్న పిడమర్తి రవి అందుకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారునిజంగా అవినీతి జరిగితే అందుకు సంబంధించిన పత్రాలు ఆధారాలతో నిరూపించాలని లేదంటే నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారుడంపింగ్ యార్డు అంశంపై వాస్తవాలు ఆధారాలతో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మహేష్ స్పష్టం చేశారు దమ్ము ధైర్యం ఉంటే ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని పిడమర్తి రవికి సవాల్ విసిరారు

# అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు





**మిర్యాలగూడ/ఆగస్టు 21 (జర్నలిస్ వార్త):** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) అన్నారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా, సులభతరంగా మారుతుందని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను గ్రామస్థాయిలోనే అందుబాటులోకితీసుకురావడంతో పాటు అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కారులో మహిళ మృతదేహం..

## ఎల్కతుర్తిలో కలకలం





**ఎల్కతుర్తి/ఆగస్టు 21 (జర్నలిస్ వార్త):** మండల కేంద్రంలోని చెక్‌పోస్టు సమీపంలో మూడు రోజులుగా నిలిపి ఉన్న హోండా కారులో మహిళ మృతదేహం లభించడం కలకలం రేపింది. కారులో నుంచి దుర్గంధం రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన వెలుగులోకి వచ్చింది.స్థానిక కార్యదర్శి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు వివరాల్లోకి వెళితే.. పాల వ్యాపారి విజయ్‌కు చెక్‌పోస్టు సమీపంలో నిలిపి ఉన్న కారులో నుంచి దుర్వాసన రావడంతో శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో అక్కడికి వెళ్లి పరిశీలించాడు. అనుమానం రావడంతో పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సీఐ పులి రమేష్, ఎస్ఐ నరసింహారావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కారును పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది సహాయంతో కారులోని మహిళ మృతదేహాన్ని బయటకు తీశారు.



అంకతి మానస
ఫైల్

మృతురాలు బ్లూ కలర్ ప్యాంట్, పసుపు రంగు పైజామా ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కారు డిక్కీలో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతురాలిని కరీంనగర్ సెంటీనగర్ కాలనీకి చెందిన అంకిత మానస(2530)గా గుర్తించినట్లు తెలిపారు.

**కారు యజమాని అదుపులోకి..**

కారు యజమాని ఎవరు? మృతదేహాన్ని కారులోకి ఎలా తరలించారు? మూడు రోజులుగా కారు అక్కడే ఎందుకు నిలిపి ఉంచారు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో ఎల్కతుర్తి గ్రామానికి చెందిన కొమ్మిడి వినోద్‌కుమార్, తండ్రి సమ్మిరెడ్డి పేరు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.డీసీపీ ధారా కవిత పర్యవేక్షణలో సీఐ పులి రమేష్, ఎస్ఐ నరసింహారావు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

# లారీ ఢీకొని సైక్లిస్టు దుర్మరణం

**బస్టాండ్ సమీపంలో ఘోర ప్రమాదం.. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి**

**తల్లాడ/ఆగస్టు 21 (జర్నలిస్ వార్త):**



మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందాడు. తల్లాడకు చెందిన అన్నదేవర నాగేశ్వరరావు వ్యక్తిగత పనుల నిమిత్తం సైకిల్‌పై తల్లాడ సెంటర్‌కు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.తల్లాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న టీజీ 02 టీ 5868 నంబర్ గల లారీ బస్టాండ్ సమీపంలో నాగేశ్వరరావు సైకిల్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆయన సైకిల్‌పై నుంచి కిందపడిపోయాడు. అదే సమయంలో లారీ ముందు చక్రం ఆయన చేతిపై నుంచి దూసుకెళ్లడంతో చేయి నుజ్జునుజ్జయి తీవ్ర రక్తస్రావమైంది.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, బాటసారులు వెంటనే 108కు సమాచారం అందించారు. తీవ్ర గాయాలతో ఉన్న నాగేశ్వరరావును 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. ఈ ఘటనతో స్థానికంగా విషాదం నెలకొంది. ప్రమాదంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# వైరాలో ఎంప్లాయ్‌మెంట్ కార్డు రిజిస్ట్రేషన్ మేళా

**వైరా/ఆగస్టు 21 (జర్నలిస్ వార్త):**

విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేసేందుకు వైరాలో ఎంప్లాయ్‌మెంట్ కార్డు రిజిస్ట్రేషన్ మేళా, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి యన్. మాధవి తెలిపారు. వైరా, పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆగస్టు 22న ఉదయం 11 గంటలకు వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ఖమ్మం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ప్రస్తుతం ఎంప్లాయ్‌మెంట్ కార్డు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే కొనసాగుతున్నప్పటికీ, వైరా పరిసర ప్రాంతాల అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఈ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో నేరుగా కళాశాలకు వచ్చి మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అనంతరం ఉపాధి కల్పన కార్యాలయం ద్వారా వివరాలను నమోదు చేసి ఎంప్లాయ్‌మెంట్ కార్డు పొందేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.అలాగే ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్యలో ఎలాంటి కోర్సులను ఎంచుకోవాలి, అందుబాటులో ఉన్న వివిధ కెరీర్ అవకాశాలు, భవిష్యత్ ప్రణాళికలు, ఉద్యోగ మేళాలు, శిక్షణ కార్యక్రమాలపై విద్యార్థులకు ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్ అందించనున్నట్లు మాధవి వెల్లడించారు.

వైరా, పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంప్లాయ్‌మెంట్ కార్డు రిజిస్ట్రేషన్‌తో పాటు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# కడారి గూడెంలో నూతన గ్రామ కమిటీలు



**వర్ధన్నపేట/ఆగస్టు 21 (జర్నలిస్ట్ వార్త):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కడారి గూడెం గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ విద్యార్థి సమాఖ్య నూతన గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమాన్ని జిల్లా నాయకులు చేన్న రాజు మాదిగ, కంజర్ల కొమ్మాలు మాదిగ, మంద ఎల్లయ్య మాదిగ సమన్వయం చేశారు. ముఖ్య అతిథిగా వర్ధన్నపేట మండల ఇన్‌చార్జి జిల్లా ధర్మయ్య మాదిగ, నాయకులు ముత్యాల మల్లేశం, చాడ కర్ణాకర్ మాదిగ పాల్గొన్నారు.

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడిగా చేన్న ఎల్లయ్య మాదిగ, ఉపాధ్యక్షుడిగా కంజర్ల రాజు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గాదె చంద్రయ్య మాదిగ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మంద ఎల్లయ్య మాదిగ, మల్లెపాక సంపత్ మాదిగ, ఆరూరి ఉప్పలయ్య మాదిగ, చేన్న దశరథం మాదిగ ఎన్నికయ్యారు. మాదిగ విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడిగా కంజర్ల ఎల్లయ్య మాదిగ, ఉపాధ్యక్షుడిగా మంద రాజు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కంజర్ల వెంకటయ్య మాదిగ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జన్ను ఎల్లయ్య మాదిగ, చేన్న ఎల్లయ్య మాదిగ, కంజర్ల మల్లయ్య మాదిగ, మంద గణేష్ మాదిగ, మల్లెపాక భాస్కర్ మాదిగ ఎన్నికయ్యారు.

# రూపారెడ్డికి ఘన నివాళి

**విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం**



**కేసముద్రం/ఆగస్టు 21 (జర్నలిస్ వార్త):**

నల్లగొండ జిల్లాలో జరిగిన విషాదకర ఘటనలో మృతి చెందిన ప్రిన్సిపాల్ రూపారెడ్డికి కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ రూపారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా యాకాంతం గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. గురువులు విద్యార్థులకు విద్యతోపాటు మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతను నేర్పించే మార్గదర్శకులని పేర్కొన్నారు. చిన్నచిన్న సమస్యలు, అపార్థాలు, ఆవేశాలకు లోనై తీసుకునే తప్పుడు నిర్ణయాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు.

**ఆవేశానికి లోనుకావద్దు**

విద్యార్థులు కోపం, ఆవేశాన్ని అదుపులో ఉంచుకోవాలని, ఏదైనా సమస్య ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పరిష్కరించుకోవాలని సూచించారు. పెద్దల సూచనలు, గురువుల సలహాలను గౌరవించడం ద్వారా మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చన్నారు.పాఠశాలలు కేవలం పాఠాలు బోధించే కేంద్రాలు కాదని, మంచి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే ఆలయాలని అన్నారు. విద్యార్థుల్లో శాంతి, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రూపారెడ్డి మృతి విద్యారంగానికి తీరని లోటని పేర్కొంటూ ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని రూపారెడ్డికి నివాళులర్పించారు.

